క్లుప్తంగా

తిరుమలలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



జనగామ: ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి–పద్మలతారెడ్డి దంపతులు, టీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త గుజ్జ సంపత్‌రెడ్డి దంపతులు సోమవారం తిరుమలలోని ఏడుకొండల శ్రీ వేంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

సీపీని కలిసిన 'పెద్ది'



జనగామ: వరంగల్ కమిషనర్(సీపీ)గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఏవీ రంగనాథ్‌ను జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఎఫ్‌సీఐ మేనేజర్‌ను కలిసిన బెలిదె వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బెలిదె వెంకన్నగుప్తా సోమవారం కాజీపేట ఎఫ్‌సీఐ ఏరియా మేనేజర్ నీరజ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సతీష్, కోశాధికారి మణికాంత్ తదితరులు ఉన్నారు.

నియామకం

చిల్పూరు: వెంకటాద్రిపేటకు చెందిన ఎంపీటీసీ ఎన్నకూస కుమార్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నియామకమయ్యారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన మహాసభలో నూతన కమిటీ సభ్యుడిగా కుమార్‌ను ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కమిటీకి ఎంపిక చేశారని భవిష్యత్‌లో పేదల పక్షాన భూపోరాటాలు ఉధృతం చేస్తానని తెలిపారు.

బీఆర్‌ఎస్ ప్రోగ్రామ్స్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా రవి

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమాల నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా జెడ్పీస్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవిని నియమించినట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

జనగామ : ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా కేంద్రంలోని సీఆర్‌రెడ్డితోటలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి, స్థానికుల కథనం ప్రకారం.. రఘునాథపల్లి మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన మొగిలి నర్సింగరావు (40) ఏడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం జనగామకు వచ్చి సీఆర్‌రెడ్డితోట సమీపంలో అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి భార్య, ముగ్గురు కూతుర్లున్నారు. ఏడాదిగా నర్సింగరావుకు పని లేకపోవడంతో ఇంట్లోనే ఖాళీగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. నర్సింగరావు భార్య యాకమ్మ పని చేస్తూ కుటుంబ పోషణలో పాలుపంచుకుంటోంది. బంధువుల ఇంట్లో కార్యక్రమానికి కుటుంబం అంతా వెళ్లగా నర్సింగరావు ముందుగానే ఇంటికి తిరిగి వచ్చాడు. రాత్రి 7 గంటల సమయంలో యాకమ్మ పిల్లలతో కలిసి ఇంటికి రాగా నర్సింగరావు తలుపులు తీయలేదు. దీంతో స్థానికులు వచ్చి తలుపులు పగలగొట్టగా నర్సింగరావు ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. భర్త మృతదేహాన్ని చూసి యాకమ్మ సొమ్మసిల్లగా స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రఘుపతి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రైలులోనుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు

రఘునాథపల్లి: రైలులోనుంచి ప్రమాదవశాత్తు జారి పడిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన రఘునాథపల్లి రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన భగీరథకుమార్ మండల కేంద్రంలోని రూప రైస్ మిల్లులో హమాలీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. సోమవారం స్వరాష్ట్రానికి వెళ్లేందుకు రఘునాథపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కాడు. రైలు కదులుతుండగా డోర్ వద్ద భగీరథకుమార్ ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, రైల్వే సిబ్బంది వెంటనే 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో వడ్లకొండ సోమనర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం అమె అంతిమయాత్రలో ఐదుగురు అక్కా చెల్లెళ్లు పాల్గొన్నారు. తల్లికి కూతురు యాదమ్మ తలకొరివి పెట్టారు.

ముక్కోటి దర్శనం

జనగామ: వేంకటేశ్వర ఆలయంలో పూజ చేస్తున్న అర్చకులు



కూనూర్: స్వామివారి వాహన సేవ నిర్వహిస్తున్న పద్మశాలీలు



రఘునాథపల్లి: నిడిగొండ ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు



పరమ పవిత్రమైన ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు భక్తులు వెళ్లి పూజలు చేపట్టగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీమహా విష్ణువుకు ఇష్టమైన ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అర్చకులు ప్రసాద వితరణ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



చిల్పూరు: ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఈఓ, చైర్మన్



జనగామ: మూలబావి అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు



పాలకుర్తి టౌన్: సోమేశ్వర ఆలయంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో..



జనగామ: అంబేద్కర్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



లింగాలఘణపురం: నవాబుపేట కోదండ రామస్వామి ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు



బచ్చన్నపేట: సిద్దేశ్వరాలయంలో పూజ నిర్వహిస్తున్న భక్తులు

పన్నులు చెల్లించాలి



బచ్చన్నపేట: గ్రామస్తులు ఇంటి, నల్లా పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటును అందించాలని మండలంలోని గోపాల్‌నగర్ పంచాయతీ కార్యదర్శి మోకు కవిత అన్నారు. సోమవారం జీపీ కారోబార్ లలితతో కలిసి గ్రామంలో ఇంటి, నల్లా పన్నులను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ తరుపున ప్రజలకు తాగు నీరు, వీధిదీపాల వసతి కల్పించడంతో పాటు డ్రెయినేజీ, రోడ్లు శుభ్రం వంటి పనులు చేయించడం జరుగుతుందన్నారు. ప్రజలు పన్నుల వసూలుకు సహకరించాలని కోరారు. జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు

జఫర్‌గఢ్: మహిళా సంక్షేమాన్ని పాలకులు పూర్తిగా విస్మరిస్తున్నారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎండి షబానా అన్నారు. కేరళ రాష్ట్రంలో 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహించే అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం 13వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని మండలంలోని తమ్మడపల్లి (జి)లో సంఘం నాయకులు, మహిళలు కలిసి కొవ్వొత్తులతో ఆదివారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సంఘం నాయకులు ఎల్లమ్మ, రోజా, రాజమ్మ, రజిత, లక్ష్మి, పద్మ, సంధ్య, రేణుకతో పాటు మహిళలు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన మోతె రాంచంద్రయ్యకు సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.12వేల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే రాజయ్య అందజేశారు. మార్కెట్ డైరెక్టర్ రంగు హరీష్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న మెగా క్రికెట్ టోర్నమెంట్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ శివారులో కడియం ఫౌండేషన్ సహకారంతో కడియం యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. పోటీల్లో 19వ రోజైన ఆదివారం ప్రీ క్వార్టర్స్‌లో తలపడిన జట్లు నువ్వా నేనా అన్నట్లుగా ఉత్తమ ప్రతిభ కనబర్చగా అన్ని మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగాయి. కాగా, ఆదివారం పోటీలను చిల్పూరు మండల వైస్ ఎంపీపీ భూక్య సరిత, చిన్నపెండ్యాల, లింగంపల్లి, కొండాపూర్, మల్కాపూర్ సర్పంచ్‌లు మామిడాల లింగారెడ్డి, ఎదునూరి రవి, లొడెం రజిత, కొంగరి రవి, జఫర్‌గఢ్ మాజీ సర్పంచ్ కుల్ల మోహన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. నమిలిగొండ ఎంపీటీసీ రజాక్ యాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బెలిదె వెంకన్న, శంకర్, రాములు, గట్టయ్య, రాజేష్‌నాయక్, వెంకటస్వామి, యాదగిరి, సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు



సుధీర్‌ను సన్మానిస్తున్న డీఈఓ రాము తదితరులు

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన సిరిపురం గ్రామ విద్యార్థి బర్ల సుధీర్‌కు సిద్దిపేటలోని ఆర్‌వీఎం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించాడు. బర్ల సుధీర్ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మోడల్ స్కూల్‌లో చదివి ఏడాది పాటు కోచింగ్ వెళ్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు పొందాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ పుష్పకుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో డీఈఓ రాము ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందనేందుకు నిదర్శం బర్ల సుధీర్ అని అన్నారు. విద్యార్థులు సుధీర్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధించాలని అన్నారు. డీఆర్‌డీఓ రాంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ మోజులో పడి డబ్బులు వృథా చేసుకోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పుష్పకుమారి విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.5వేల బహుమతిని అందించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ ఉమారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమైన కూడళ్లలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న చైర్మన్

చిల్పూరు: మండలంలోని గ్రామాల్లో ముఖ్యమైన కూడళ్లలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయిస్తానని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద ఉన్న ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సోమవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, తీగలతండా సర్పంచ్ లక్ష్మీభాగూర్, తీగల సాంబరాజు, మండల రైతు కోఆర్డినేటర్ జనగాం యాదగిరి, ఆలయ చైర్మన్ రాజు, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప కుటీరానికి భూమిపూజ

పాలకుర్తి టౌన్: మల్లంపల్లిలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని సోమవారం శ్రీఅయ్యప్ప స్వామి కుటీరం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కుటీరానికి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ.5లక్షలు విరాళం ప్రకటించారు. పూజలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ హేమలత, నవీన్‌కుమార్, అశోక్‌రెడ్డి, చంద్రమౌళి రాయయోగి, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈఓ కె.రాము చేతుల మీదుగా ఆవిష్కరించారు. మహిపాల్ రెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

జనగామ/పాలకుర్తి/రఘునాథపల్లి/బచ్చన్నపేట/జఫర్‌గఢ్: ఆరోగ్యవంతమైన యువకులు రక్తదానం చేసి, ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేయాలని లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్, లయన్ డాక్టర డి.లవకుమార్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి వరగల్ జిల్లా 320ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు పుట్టినరోజు సందర్భంగా సోమవారం పట్టణంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో రక్తదానం శిబిరం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జనగామ ఆబాద్, మిలీనియం, సెంటీనియల్, సూర్య, డైమండ్స్, శ్రీసాయి, ఓంసాయి, గ్రేటర్, బి.బాయ్స్‌లకు చెందిన 50 మంది లయన్స్ క్లబ్ ప్రతినిధులు రక్తదానం చేశారు. కె.రాజశేఖర్ రెడ్డి, ఉప్పలయ్య, బచ్చు రమేశ్, పి.వెంకట్‌రెడ్డి, బి. బాల భరద్వాజ్, గూడ రాజాబోస్, జి. రామకృష్ణ, కృష్ణ, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కృష్ణ జీవన్ బజాజ్, సంజయ్ కుమార్, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ జనార్దన్‌రెడ్డి, ప్రభాకర్ రావు, శ్రీరాం శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, పాలకుర్తి, రఘునాథపల్లి, బచ్చన్నపేటలో పరశురాములు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, ఆస్పత్రుల్లో రోగులకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన జఫర్‌గఢ్ మండలం రేగడితండా శివారు టీబీతండా వద్ద ఉన్న మా ఇల్లు అనాథ ఆశ్రమంలో అనాథ పిల్లలకు భోజన సదుపాయం కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో క్లబ్ పూర్వ ప్రాంతీయ చైర్ పర్సన్ ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు మల్లవరం వెంకటేశ్వర్ రెడ్డి, జోనల్ చైర్ పర్సన్ వేముల బాలరాజు, లయన్ కరుణాకర్‌రెడ్డి ,సంతోష్, మధుసూదన్, అనిల్, కూరెల్లి ఉపేందర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న వెంకటమల్లయ్యగౌడ్

రఘునాథపల్లి: భాంజీపేటకు చెందిన గీత కార్మికుడు గైని పరమేష్‌గౌడ్ ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాల పాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో పరమేష్‌గౌడ్‌కు టాడి కార్పొరేషన్ ద్వారా తక్షణ సాయంగా రూ.15 వేలు మంజూరయ్యాయి. కాగా, సోమవారం జిల్లా బీసీ వెల్ఫేర్ అభివృద్ధి అధికారి రవీందర్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్యగౌడ్‌లు భాంజీపేటకు చేరుకొని బాధితుడి కుటుంబ సభ్యులకు రూ 15 వేల చెక్కు అందజేశారు. కేజీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, ఆంజనేయులు, రాజు, భిక్షపతి, వీరయ్య, భాస్కర్, రాంనర్సయ్య, యాదగిరి, రమేష్, గణేష్ పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్దాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ఆసక్తి కలిగిన యువతీ, యువకులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. అసంపూర్తి పల్లె ప్రగతి పనులను వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య తదితరులు

లింగాలఘణపురం: మండల ప్రజలంతా నూతన సంవత్సరంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. నెల్లుట్ల బైపాస్ వద్ద సోమవారం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, వర్క్స్ కమిటీ చైర్మన్ నాగేందర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గణపతి, ప్రధాన కార్యదర్శి శ్రీపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

'కొమ్మూరి' జన్మదిన వేడుకలు



జనగామ: కొమ్మూరి బర్త్‌డే వేడుకల్లో నాయకులు

జనగామ/తరిగొప్పుల/బచ్చన్నపేట: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కొమ్మూరి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో వ్యవసాయాన్ని పండగగా చేసేందుకు కృషి చేశాడన్నారు. జనగామలో రిజర్వాయర్ల నిర్మాణంలో ఆయన ముఖ్య భూమిక పోషించాడన్నారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ జిల్లెల్ల సిద్దారెడ్డి, సిద్దెంకి సర్పంచ్ సుంకరి నిర్మల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆలేటి సిద్దిరాములు, లింగాల నర్సిరెడ్డి, బొట్ల నర్సింగరావు, గాలి కృష్ణ, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి క్రాంతి, గంధమల్ల కమలాకర్, శ్రీకాంత్, మేక క్రాంతి పాల్గొన్నారు. అలాగే తరిగొప్పులలో కాంగ్రెస్ నాయకుడు వగలబోయిన యాదగిరి ఆధ్వర్యంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. బచ్చన్నపేట మండల కేంద్రంలో ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్ అనుమాషం



జనగామ: పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తూ..

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో సర్పంచ్‌ల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో జిల్లా కేంద్రంతోపాటు, పలు మండలాల్లో కాంగ్రెస్ నాయకులను సోమవారం ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధర్నా చౌక్ వద్ద ఆందోళనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను పోలీసులచే ముందస్తు అరెస్టులు చేయించడం అమానుషమని అన్నారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో నాయకులు మాసాన్‌పల్లి లింగాజీ, ధర్మపురి శ్రీనివాస్, మోటె శ్రీనివాస్, ఎండి మాజీద్, పిట్టల సతీష్, నిడిగొండ శ్రీనివాస్, వంగ వెంకట్‌రెడ్డి, కోడూరి మహాత్మాచారి, చెరుకూరి శ్రీనివాస్, కోళ్ల రవిగౌడ్, గుగులోతు కొమురెల్లి, కావటి భాస్కర్‌యాదవ్, నీలం యువరాజ్, కొలిపాక సతీష్, చింత ఎల్లయ్య, నాయకులు మేకల మల్లేశం, కత్తుల కట్టయ్య, అన్నెబోయిన భిక్షపతి, తాటికాయల రాజేందర్, బోనగిరి యాకస్వామి, ఇనుముల నాగరాజు, గుగులోతు నరేందర్, గిరిగాని కుమారస్వామి, రాపాక సత్యనారాయణ తదితరులు ఉన్నారు. కాగా, రాష్ట్రప్రభుత్వం పోలీసులచే కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయించడాన్ని నిరసిస్తూ స్టేషన్‌ఘన్‌పూర్‌లో యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి రాష్ట్రప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

గుడికి రూ.2లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండలో ముదిరాజ్‌ల కులదైవమైన పెద్దమ్మగుడి నిర్మాణానికి వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్ చల్లా ఉమాదేవి రూ.2లక్షలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పెద్దమ్మ గుడి నిర్మాణానికి తమవంతుగా విరాళం అందించామన్నారు. దైవ కార్యాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం, శాంతి, సహనం పెంపొందుతుందన్నారు. ఉపసర్పంచ్ మారపాక రాములు, వార్డు సభ్యుడు బోయిని ఎల్లయ్య, ముదిరాజ్ కుల పెద్దలు నీల వెంకటనర్సు, గుర్రం భిక్షపతి, కుమార్, కుమారస్వామి, రాజయ్య, నర్సయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

సురేందర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

స్టేషన్‌ఘన్‌పూర్: గతంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా, ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా చింతకుంట్ల సురేందర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే రాజయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ సంపత్ రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ చింతకుంట్ల నరేందర్‌రెడ్డి సోదరుడైన సురేందర్‌రెడ్డి ప్రథ మ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘన్‌పూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే , జెడ్పీ చైర్మన్ తదితరులు హాజరై సురేందర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

జనగామ రూరల్: రఘునాథపల్లి తహసీల్దార్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని గిద్దెబండ తండాకు చెందిన ఎ.స్వామినాయక్ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్వామినాయక్ మాట్లాడుతూ రఘునాథపల్లి మండలంలోని మేకలగట్టులోని గిద్దెబండ తండాలోని భూమిని సర్వే చేయకుండా గిరిజనుల ఆరాధ్య దైవం సీత్లా భవాని పండుగ చేసుకునే స్థలాన్ని ధ్వంసం చేసి క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. గ్రామానికి చెందిన సర్వే నంబర్ 7లో ఉన్న భూమిని 49 అని చూపుతూ అక్కడి స్థలాన్ని పూర్తిగా చదును చేశారని తెలిపారు. తండా ప్రజలను బెదిరింపులకు గురిచేస్తూ స్థలాలను ఆధీనంలోకి తీసుకుంటున్న తహసీల్దార్, ఆర్‌ఐలపై కేసు నమోదు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.